www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 28 నవంబర్ 2024
5
వైఎస్ఆర్

సంతోష్ విజితకు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి-కడప: ఆర్ట్స్ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగంలోని పరిశోధక విద్యార్థిని జిల్లెల సంతోష్ విజితకి వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. విజిత ఆప్టికల్ కారక్టరైజెషన్ ఆఫ్ రేర్ ఎర్త్ అయాన్స్ డోపేడ్ బోరో ఫాస్ఫోజింక్ టంగ్‌స్టేట్ గ్లాస్సెస్ అనే అంశం మీద పరి శోధన చేసినందుకు డాక్టరేట్ వచ్చిందన్నారు. ఈమె పరిశోధనలకు భౌతిక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేయుచున్న డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి పరిశోదన పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈమె పరిశోధన ఫలితాలు ఆరు పరిశోధన పత్రాలు అంతర్జాతీయ జర్నల్స్‌లలో ప్రచురితమయ్యాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని భోజ్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో భౌతికశాస్త్రం విభాగాధిపతిగా పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల రవీంద్రనాథ్, అధ్యాపక బృందం విజితను అభినందించారు.

పాఠశాలల పనివేళలు మారేనా..!

- పైలెట్ ప్రాజెక్టులుగా 36 హైస్కూళ్లు
- 30 నాటికి వివరాల అందజేత
- నేడో..రేపో ప్రభుత్వానికి జాబితా

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల పనివేళల మార్పునకు కసరత్తు ఊపందుకుంది. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల ఫలితాలకు ధీటుగా తీర్చిదిద్దనున్నట్లు చెబుతోంది. పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొన్నింటిని ఎంపిక చేసిన జాబితాను అందజేయాలని విద్యా శాఖను ఆదేశించింది. జిల్లా విద్యా శాఖ మండలానికి ఒకటి చొప్పున ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల జాబితాను సిద్ధం చేసింది. నెలాఖరు నాటికి అందజేయడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 36 మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,832 పాఠశాలలు ఉన్నాయి. ప్రైమరీ పాఠశాలలు 1,902, మున్సిపల్ 84, ఎయిడెడ్ 66, ప్రయివేట్ 773, మదరసాలు 07 వరకు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల పనివేళలను మార్చడం ద్వారా సంస్కరించాలని నిర్ణయించింది. జిల్లా విద్యాశాఖకు పైలెట్ ప్రాజెక్ట కింద అర్హత కలిగిన ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, నివేదిక పంపించాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 36 మండలాలకు ఒకటి చొప్పున హైస్కూళ్లను ఎంపిక చేసింది. నెలాఖరులోపు నివేదిక అందజేయడానికి సిద్ధమైంది.

అమలుకు..అవాంతరాలు..!

ప్రభుత్వం పనివేళలను మార్పును ఎప్పటి నుంచి అమలు చేస్తుందో తెలియడం లేదు. పనివేళలు మార్పు సందర్భంగా రాష్ట్రంలోని పలువురు విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల అభిప్రాయాల సేకరణపై దృష్టి సారించింది. పాఠశాలల పనివేళల మార్పుపై లభించే స్పందన ఆధారంగా ముందుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

వేళల పెంపుపై భిన్నాభిప్రాయాలు

ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యార్థులు పాఠశాలల్లో గడిపితే అలిసిపోయే అవకాశం ఉందని, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన విద్యార్థులు శీతాకాలంలో 5.30 గంటలు దాటితే చీకటి కమ్ముకునే అవకాశాల నేపథ్యం వంటి సమస్యలు అడ్డంకిగా మారే పరిస్థితి కనిపిస్తోంది. సాయంత్రం నాలుగు గంటల సమయానికి ఇంట్లో ఏదో ఒకటి తినే అలవాటును అధిగమించడానికి స్నాక్స్‌ను సరఫరా చేయాలనే సూచనలు వెల్లువెత్తుతుండడం గమనార్హం.

ఎంపిక చేసిన పాఠశాలలివే..

జిల్లాలోని 36 మండలాలకు ఒకటి చొప్పున జాబితాను ఎంపిక ప్రక్రియ సిద్ధమైంది. వీటిని నెలాఖరులోపు అందజేయడానికి విద్యాశాఖ సిద్ధమైంది. అట్లూరు మండలంలోని సోమేశ్వరం జడ్‌పిహెచ్‌ఎస్, బి.కోడూరులో

ఆదిత్యరాంపేట, బి.మఠంలో కెఎంపల్లి, బద్వేల్ బాలికల హైస్కూల్, చింతకొమ్మదిన్నె, చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లి హైస్కూల్, చాపాడు జడ్‌పిహెచ్ ఎస్‌ను ఎంపిక చేసింది. చెన్నూరు బాలుర, కడప ఎంసిహెచ్‌ఎస్ మెయిన్, దువ్వూరు, గోపవరం మండలం భావనారాయణనగర్, జమ్మలమడుగు గర్ల్స్, కలసపాడు బాలుర, కమలాపురం పెద్దచెప్పలి హైస్కూల్, ఖాజీపేట మండలం అప్పనపల్లి హైస్కూల్, కొండాపురం హైస్కూల్, లింగాల మండలం పెద్దకుడాల హైస్కూల్, ముద్దనూరు హైస్కూళ్లతో జాబితాను సిద్ధం చేసింది. మైదుకూరు మండలం నంద్యాలంపేట హైస్కూల్, మైలవరం మండలం దొమ్మర నంద్యాల, పెద్దముడియం, పెండ్లిమర్రి హైస్కూళ్లను ఎంపిక చేసింది. పోరుమామిళ్ల మండలం టేకూరుపేట, ప్రొద్దుటూరు మండలం ఖాదరాబాద్, పులివెందుల మండలం బ్రాహ్మణపల్లి, రాజుపాలెం, కాశినాయన మం డలం నరసాపురం, సిద్ధవటం మండలం ఎగువపేట, సింహాద్రిపురం, తొండూరు, వి.ఎన్‌పల్లి మండలం గంగిరెడ్డిపల్లి, వల్లూరు వేంపల్లి బాలుర, వేముల మండలం చాగలేరు, ఒంటిమిట్ట, యర్రగుంట్ల బాలుర హైస్కూళ్ల జాబితాను ఎంపిక చేసింది.

పనివేళల పెంపుతో ఇబ్బందులు

గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ప్రభుత్వం శాస్త్రీయంగా రూపొందించిన విధానాన్ని మార్పు చేయడం తగదు. సాయంత్రం వేళకు విద్యార్థులు తీవ్రంగా అలిసిపోయే ప్రమాదం ఉంది.

- ఎద్దుల రాహుల్, ఎస్‌ఎఫ్ఐ అధ్యక్షులు, కడప.

పని వేళల మార్పు తగదు

పాఠశాలల పనివేళల మార్పు తగదు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉండడం వల్ల అలిసిపోయే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఒత్తిడి పెరిగి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

- పి.మహేష్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కడప.

పైలెట్ ప్రాజెక్టు జాబితా సిద్ధం

పైలెట్ ప్రాజెక్టు అమలుకు అనుగుణంగా 36 మండలాలకు చెందిన హైస్కూళ్ల జాబితాను సిద్ధం చేశాం. ఈనెలాఖరు నాటికి ప్రభుత్వానికి అందజేస్తాం.

- యు.మీనాక్షి, డిఇఒ, కడప.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- నగర పాలక సంస్థ ఎదుట ధర్నాలో నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కోవిడ్ సమయంలో కొత్తగా తీసుకున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ డిమాండ్ చేశారు. బుధవారం కడప నగర పాలక సంస్థ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ కొత్త కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 2 నెలల వేతనాలు, ఐడి కార్డులు, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐపిఎఫ్ కల్పించాలని, శీతాకాలంలో ఉదయాన్నే మస్టర్ 5.40 గంటలకు పెట్టాలని అధికారులు చెప్పడం సరికాదన్నారు. అడిషనల్ కార్మికుల పైన సెక్రటరీ వేదింపులు ఆపాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకి 36 జిఒ ప్రకారం వేతనాలు పెంచాలని చెప్పారు. 9 మంది ట్యాంకర్ డ్రైవర్స్‌కి వైఆర్ జిఒ ప్రకారం జీతాలు ఇవ్వాలని, 13 మందిని డ్రైవర్లుగా గుర్తించాలని పేర్కొన్నారు. శానిటేషన్ డ్రైవర్స్ నిశ్చితాకాలంలో 5 గంటలు మస్టర్‌కి రావడానికి కార్మికులు చాలా ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. దూర ప్రాంతం నుంచి ఆటోనగర్, తిలక్‌నగర్, రామాంజనేయపురం, రామరాజుపల్లి చుట్టుపక్కల దూర ప్రాంతం నుంచి వచ్చే

ఆందోళన చేస్తున్న నాయకులు, కార్మికులు

కార్మికులను దృష్టిలో ఉంచుకుని 5.40కి మస్టర్‌ని మార్చాలని పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్స్‌ని తక్షణమే పరిష్కారం చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు ఇత్తడి ప్రకాష్, సుంకర రవి, కిరణ్, సాయి, నాగరాజు, శివ, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌టిపిపిలో కొనసాగుతున్న ఉద్రిక్తత

- ఆర్‌టిపిపి, కొండాపురంలో పోలీసుల మోహరింపు
- బూడిద కోసం కూటమి నేతల పోట్లాట
- ఎమ్మెల్యే ఆది, జెసి మధ్య ఆధిపత్య పోరు

ఆర్‌టిపిపిలో నిలిపివేసిన లారీలు (ఇన్‌సెట్‌లో) మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

ఆర్‌టిపిపి నుంచి బూడిదను తాడిపత్రికి తరలించే విషయంలో జమ్మలమడుగు బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి గ్రూపుల మధ్య వివాదం కొనసాగుతోంది. రెండు రోజులుగా ఆర్‌టిపిపి, కొండాపురం సరిహద్దు ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రెండు గ్రూపుల మధ్య వివాదానికి సంబంధించి చర్చలు జరుగుతున్నా ఇంకా ఓ కొలిక్కి రాలేదు. తాడిపత్రి నుంచి జెసి అనుచరులు వస్తున్నారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్తగా పోలీసు బలగాలు మొహరించాయి. అనంతపురం, కడప జిల్లా సరిహద్దు ప్రాంతమైన కొండాపురం మండలంలో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. కాగా జెసి ప్రభాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి ఇద్దరూ కూటమి నేతలే కావడం విశేషం. జెసి దివాకర్‌రెడ్డి తాడిపత్రికి చెందిన టిడిపి నాయకుడు, ఆదినారాయణరెడ్డి బిజెపి ఎమ్మెల్యే వీళ్లిద్దరి మధ్య ఫ్లైయాష్ తరలింపునకు సంబంధించిన ఒప్పందంపై విభేదాలు తలెత్తాయి. జమ్మలమడుగు నియోజకవర్గ పరిధిలోకి ఆర్‌టిపిపి వస్తుంది. తమ నియోజకవర్గంలో ఏం జరిగినా తమ కనుసన్నల్లోనే జరగాలని ఆదినారాయణరెడ్డి భావిస్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలోని సిమెంట్ పరిశ్రమలకు ఆర్‌టిపిపి నుంచి జెసి అనుచరుల వాహనాలు ఫ్లైయాష్ తరలిస్తున్నాయి. దీనిపై ఒప్పందం కుదరకపోవడంతో జెసి వాహనాల్ని ఆర్‌టిపిపికి ఎట్టి పరిస్థితుల్లో రానివ్వకూడదని ఆదినారాయణరెడ్డి అనుచరులు పంతం పట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం జెసి వాహనాలు ఆర్‌టిపిపికి వస్తున్నాయని తెలిసి, ఆర్‌టిపిపి సమీపంలోని కలమల్ల వద్ద ఆదినారాయణరెడ్డి అనుచరులు భారీగా మోహరించారు. వస్తే అడ్డుకోడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ బందోబస్తు ఏర్పాటు చేశారు. బూడిద తమ దగ్గర ఉంది కాబట్టి తమ వాహనాలతో తరలిస్తామని ఆదినారాయణరెడ్డి అనుచరులు అంటున్నారు. కానీ తరలించేది తాడిపత్రికి కాబట్టి తమ వాహనాల్లోనే తీసుకువస్తామని జెసి ప్రభాకర్‌రెడ్డి అంటున్నారు. ఈ క్రమంలో రెండు గ్రూపుల మధ్య పంచాయతీ పెరిగిపోయింది. జెసి వాహనాలు వస్తే అడ్డుకుని తీరుమామని ఆదినారాయణరెడ్డి వర్గీయులు అంటున్నారు. కాగా ఆర్‌టిపిపిలో బుధవారం 144సెక్షన్ అమలుకు తహశీల్దారు శోభన్ బాబు ఉత్తరవులు జారీ చేసారు. ఉన్నతాధికారుల అదేశాల మెరకు అల్లర్లు జరగకుండా ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎఒ సాయిజ్యోతి

పంటల బీమా ప్రీమియం చెల్లించండి : ఎఒ

ప్రజాశక్తి-వల్లూరు : రబీ పంట కాలంలో రైతులు సాగుచేసిన పంటలకు డిసెంబర్ 15లోగా ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని సాయి జ్యోతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని దిగువపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ తమ సాగుచేసిన పంటలకి పంటల బీమా తప్పకుండా చేసుకోవాలన్నారు. పంటల నమోదు కొరకు రైతులు తమ వన్ బి, ఆధార్, బ్యాంక్ పాస్బుక్ సంబంధిత అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా పొందిన క్రాప్ సోన్ సర్టిఫికెట్ కలిపి కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగుచేసిన మినుము, కంది, సెనగ పంటలను పరిశీలించారు. మినుము పంటలో పురుగు ఉధృతి ఉన్నందున బారాజెడ్ మందును 2.5 మిల్లి లీటర్లు లీటర్ నీటికి 13-0-45 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు దొరబాబు, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా ఆర్‌ఎడబ్ల్యూఇపి శిక్షణ పొందుతున్న విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

వేమనకథ దృశ్య కావ్య చిత్రీకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్ : ప్రజాకవిగా సుప్రసిద్ధులైన వేమన జీవితాన్ని ఆచార్య జి.శివారెడ్డి సహకారంతో శ్రీవిశ్వదాభిరామ వినురవేమ! వేమన కథ-దృశ్యకావ్యం అనే పేరుతో లఘుచిత్రంగా తీస్తున్నట్లు దర్శకులు ఎ.వి.ఎస్.రాజు అన్నారు. బుధవారం సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కవి, రచయిత, నాటక కర్త, నటులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డిని స్క్రీన్ టెస్ట్ చేసి వేమన పాత్రకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎ.వి.ఎస్.రాజు మాట్లాడుతూ ఈనాటి యువతరానికి మహాకవి యోగివేమన పద్యాలను, తెలుగు సాహిత్య విలువలను తెలియజేయడం కోసమే ఈ లఘు చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో రూపకల్పన జరుగుతున్న ఈ లఘు చిత్రాన్ని 2025 జనవరిలో జరుగుతున్న రెడ్డి సేవా సమితి రజతోత్సవాల్లో వేమన జయంతిని పురస్కరించుకుని కార్యనిర్వాహకులు లెక్కల కొండారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, నాగిరెడ్డి విడుదల చేస్తారని పేర్కొన్నారు. వేమన పాత్రను పోషిస్తున్న ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ మహోజ్వల కీర్తిని అర్జించిన వేమన సమాజంలో స్పృశించని అంశం అంటూ ఏదీ లేదని, ప్రతి రంగాన్ని ఆయన నిశితంగా పరిశీలించి సూక్ష్మాతి సూక్ష్మములైన అంశాలను బయటకు తీశారన్నారు. కార్యక్రమంలో మేకప్‌మెన్ రామబ్రహ్మం, నవభారత కళానిలయం ఉపాధ్యక్షులు పసుపులేటి గోపీనాథ్, కార్యదర్శి ఉప్పు పాలకొండ రాయుడు పాల్గొన్నారు.

అదనపు విధుల నుంచి మినహాయించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న వారికి అదనపు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎపి ఎన్‌జివిఎఫ్ జిల్లా చైర్మన్ నంద్యాల రాజశేఖర్, అధ్యక్షులు గణపతి రెడ్డి, కార్యదర్శి ఉమామహేశ్వరరావు కోరారు. బుధవారం జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శారదమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పశుసంవర్ధక సహాయకులుగా పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన అధికారి కలెక్టర్‌తో మాట్లాడి తగు ఆదేశాలు ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహా అధ్యక్షులు ఆరిఫ్, ఉపాధ్యక్షులు ఇమ్మానియేల్, సంయుక్త కార్యదర్శులు శివయ్య, హిమజ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ యాసీన్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో వరి సాగు

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగరంలోని పాత కడపకు చెందిన రైతు రజనీకాంత్‌రెడ్డి సేంద్రియ ఎరువులతో వరి సాగు చేశారని మండల వ్యవసాయ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం వరి వడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవళి వరి వంగడాలను సాగు చేశారని పేర్కొన్నారు. సేంద్రీయ ఎరువులతో వరి సాగు చేయడం అభినందనీయమని చెప్పారు. భవిష్యత్తులో ఈ పద్ధతిని అవలం బించాలని కోరారు. కార్యక్రమంలో ఏ ఈ ఓ లు పావని, మెహరాజ్, రైతు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రోగ్రాం కన్వీనర్ సురేష్ బాబు

చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - కడప

హెర్బేరియం విధానాలపై జాతీయ కార్యాచరణ కార్యక్రమం విద్యార్థులలో చదువుపట్ల ప్రత్యేక శ్రద్ధ, పరిశోధనలో ముందుకు రాణించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ వి.సురేష్ బాబు అన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల కడప వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ స్టార్ స్టేటస్ కార్యక్రమంలో భాగంగా హెర్బేరియం విధానాలపై రెండు రోజులపాటు జాతీయ కార్యాచరణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ వృక్ష శాస్త్రంలో కీలకమైన హెర్బేరియం తయారీ విధానం, పరిశోధనలో వాటి ప్రాముఖ్యత వంటి అంశాలపై విభాగం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు హెర్బేరియం తయారీ విధానాలపై హాండ్స్ ఆన్ ట్రైనింగ్ పద్ధతుల ద్వారా వివరించారు. వృక్ష శాస్త్ర విభాగాధిపతి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయాల్లో హెర్బేరియంలో ఉద్యోగాలు సాధించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలోని ఇతర డిగ్రీ కళాశాలకు సంబంధించిన విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్, తిలక్ విద్యాసాగర్, శివరామకృష్ణ, డాక్టర్ నీలయ్య పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ పోటీల్లో వైవీయూకు కాంస్య పతకం

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయానికి చెందిన రేఖా మోని అంతర విశ్వవిద్యాలయ పోటీలలో కాంస్య పతకం సాధించింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో దక్షిణ, పశ్చిమ భారత అంతర విశ్వవి ద్యాలయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో యోగివేమన విశ్వవిద్యాలయంకు చెందిన రేఖా మోని 45 కేజీల విభాగంలో కాంస్య పథకం సాధించింది. ఈమె సిఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బిఎ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఈ సందర్భంగా రేఖా మోని విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, వ్యాయామ విద్య, క్రీడల శాఖ విభాగ రామసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

అర్జీలు స్వీకరించిన ప్రభుత్వ విప్ మాధవి

ప్రజాశక్తి-కడప అర్బన్

అర్జీలు స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ మాధవి

ప్రభుత్వ విప్ మాధవి, టిడిపి పోలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డితో కలిసి కడప నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని అర్జీదా రులకు భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వం ప్రజాదర్బారు ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తూ సమస్యల పరిష్కార దిశగా ముందుకు వెళుతుందని వారు పేర్కొన్నారు.

ఉర్దూ హైస్కూల్లో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కడప అర్బన్

పాఠశాలలో తనిఖీ చేస్తున్న డిఇఒ మీనాక్షి

నగర పాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి యు.మీనాక్షి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని ఆమె స్వయంగా తిని చూసి మరింత నాణ్యతగా భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. జిల్లాను అన్నింట్లో ప్రథమంగా ఉంచడమే ప్రధానోపాధ్యాయుల, ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు బోధన, భోజనం మంచి నాణ్యతగా అందించాలన్నారు. ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యా యులు విద్యార్థుల క్రమశిక్షణ, క్రీడలలో నైపుణ్యం పెంపొందించుటకు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను ఏరోజుకారోజు అప్డేట్‌గా ఉంచాలన్నారు. ప్రతి పాఠశాలలో యూ డైసు, మార్కుల నమోదు, అపార్ కలిసికట్టుగా పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యా శాఖ నుంచి వచ్చే అన్ని రకాల పనులను త్వరితగతిన పూర్తి చేసి జిల్లా విద్యాశాఖకు మంచి పేరు, గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో మన జిల్లా మొదటి స్థానం వచ్చేటందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పట్టుదలతో కృషి చేయాలన్నారు. డిసెంబర్ 7వ తేదీ జరగబోవు లిమెగా పేరెంట్ టీచర్స్ సమావేశములి ను ప్రతి పాఠశాలలో దిగ్విజయం చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు సి.విజయలక్ష్మి , ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎస్‌ఎండి ఇలియాస్ భాష, ఖాజాపీర్, ఎస్‌ఎండి అయూబ్, జాకీరా ఖానమ్, మహబూబ్ బాషా, వ్యాయామ ఉపాధ్యా యుడు సాజిత్, సిఆర్‌ఎంటి ఆదిమూలం శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు నచ్చిన రంగంలో రాణించాలి : జెవివి

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థులు వారికి నచ్చిన రంగంలో రాణించాలని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న పిలుపునిచ్చారు. బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ అండ్ మ్యాజిక్ కార్యక్రమం మున్సిపల్ హైస్కూల్ మెయిన్ లో నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్, మ్యాజిక్ కార్యక్రమ ఏర్పాటు చేశారు. మ్యాజిక్ అంటే జాదూ మంత్రం ఏమీ లేదని మీరు కూడా నేర్చుకుని చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగమణి, జన విజ్ఞాన వేదిక నగర ఉపాధ్యక్షుడు అబ్దుల్ రాయల్ కరిముల్లా, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దామోదర్, సాంసంగ్ ముఖర్జీ, రామ్మోహన్ నాయక్, నరసారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి-కడప అర్బన్

కొండూరు పిచ్చమ్మ వెంకట రాజు స్మారక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నగరానికి చెందిన ప్రేమాలయంలో నిరాశ్రయులకు అల్పాహారం, భోజనం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఇడి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య హాజరై మాట్లాడుతూ సంస్థ అధ్యక్షులు కొండూరు జనార్ధన రాజు తన తల్లిదండ్రులు కొండూరు పిచ్చమ్మ వెంకటరాజుల జ్ఞాపకార్థం అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ అభాగ్యులను, అన్నార్తులను ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బి.గోపికృష్ణ, జనార్ధన రాజు సోదరి అచ్చమ్మ, కొండూరు చంద్రకళ కుటుంబ సభ్యులు శశాంక రాజు, ప్రియాంక, గొబ్బూరి కోటేశ్వ రరావు, నిర్వాహకులు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మయ్య

నార్త్, సౌత్ జోన్, తూర్పు గోదావరి జట్లు విజయం

తలపడుతున్న రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్, తూర్పు గోదావరి జట్లు

ప్రజాశక్తి-కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్-23 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా బుధవారం వివిధ క్రీడా మైదానాల్లో జరిగిన పోటీల్లో నార్త్, సౌత్ జోన్, తూర్పు గోదావరి జట్లు విజయం సాధించాయి. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై తొమ్మిది వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్క్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 27.4 ఓవర్లలో 97 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని అర్జున్ టెండూల్కర్ 45, జయకృష్ణ 14 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని శ్రీకర్ సాయి రెడ్డి 4, అచ్యుత్ హేమంత్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 98 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 14.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 101 పరుగులు చేసి తొమ్మిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని హిమకర్ 56 హర్షవర్ధన్ 34 (నాటౌట్) పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని మల్లికార్జున ఒక వికెట్ తీసుకున్నాడు.

ప్రకాశంపై సౌత్ జోన్ జట్టు..: కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో ప్రకాశం జట్టుపై 8 వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు విజయం సాధించింది. పుల్కా బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు 37.0 ఓవర్లలో 221 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రోహిత్ 67, అభినవ్ 38 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని సుతేజ్ రెడ్డి 4 మాధవ్ 3, ధరణి కుమార్ నాయుడు 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 222 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 36.1 ఓవర్లలో 222 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని రేవంత్ రెడ్డి 99 (నాటౌట్), తేజ రెడ్డి 55 పరుగులు చేశారు.

సెంట్రల్ జోన్‌పై తూర్పుగోదావరి జట్టు..: వైఎస్ఆర్ఆర్ ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టుపై రెండు వికెట్ల తేడాతో తూర్పు గోదావరి జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 38.2 ఓవర్లలో 129 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సమన్విత్ 35, దుర్గారావు 24 పరుగులు చేశారు. తూర్పు గోదావరి జట్టులోని సందేశ్ నాలుగు, శివ సూర్య రెండు, వంశీ నారాయణ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం 130 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కుదిగిన తూర్పు గోదావరి జట్టు 32.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 132పరుగులు చేసి రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ప్రాజెక్టులోని విజయ్ 51, రంగరాజు 32 పరుగులు చేశారు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ చెట్టులోని మానస్ అదుతేంగా పోలింగ్ ప్రదర్శించి ఆరు వికెట్లు తీసుకున్నాడు.

దుస్తులు పంపిణీ చేస్తున్న రామలింగారెడ్డి, కుటుంబ సభ్యులు

అనాథ వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ చేశారు. కడప నగరం ఆక్వాయాలకు చెందిన కాంట్రాక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. దాత కుమారుడైన వర్ధమాన పవన్ భార్గవరెడ్డి 11వర్ధంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు అందజేశారు. ప్రతి ఏడాది ఈ శరణాలయంలో అన్నదానం, దుస్తుల పంపిణీ చేస్తున్నట్లు దాత రామలింగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు లక్ష్మీదేవి, రాజారాజేశ్వరి, వెంకట సుబ్బారెడ్డి, అరుణ, విజరీఓ, రాఘవేంద్రరెడ్డి, ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బాధితునికి నగదు అందజేస్తున్న మధుసూదనరెడ్డి

కిడ్నీ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముద్దనూరు

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కార్యకర్త మారుతీశివకు మండల నాయకులు, సమాజ సేవా కార్యకర్త డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో యువ నాయకులు కటికరెడ్డి గుణవంతరెడ్డి రూ.లక్ష ఆర్థికసాయం చేసి మానవత్వం చాటుకున్నారు. స్థానిక కొత్త కొట్టాల వీధిలో ఉంటున్న మారుతీ శివ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం మధుసూదనరెడ్డి, గుణవంతరెడ్డి బాధితుణ్ని పరామర్శించి, తమవంతు సాయంగా ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సాగర్ బాబు, నాయకులు బదుగు సురేష్, వినోద్, నాగరాజు పాల్గొన్నారు.

30న పింఛన్ల పంపిణీ : ఎంపిడిఒ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ఈనెల 30న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 6,425 లబ్ధిదారులకు రూ.2.35 కోట్ల పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తామన్నారు. వరుసగా మూడు నెలలు పెన్షన్ తీసుకోకపోతే శాశ్వత వలసగా భావించి తొలగిస్తామన్నారు. ఆ తర్వాత వచ్చిన రోల్ బాక్ ద్వారా మళ్లీ పెన్షన్ మంజూరు అవుతుందన్నారు. వితంతు కేటగిరి కింద పెన్షన్ తర్వాత నెల నుంచి ఇస్తామన్నారు. అందుకు ఆధారాలు సచివాలయంలో అందజేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ జమ్మలమడుగు సమన్వయకర్త సింగం శివమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ జమ్మలమడుగు సమన్వయకర్త సింగం శివమోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ రాయలసీమకు ప్రత్యేకప్యాకేజీ, ప్రత్యేకహోదా ఇవ్వాలని నాడు కాంగ్రెస్ పార్టీ భావించి విభజించిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వం విభజన హామీలను తుంగలో తొక్కి వారి స్వప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా పాలిస్తున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ, ప్రత్యేకహోదా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేస్తుంటే వైసిపి, టిడిపి కనీసం మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల రాయలసీమ రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేస్తున్నారన్నారు. 2029లో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి రాష్ట్ర శ్రేయస్సు కోసం పాటు పడతామని ఆయన పేర్కొన్నారు.

దీక్షతో సన్మార్గం వైపు పయనం

ప్రజాశక్తి - వేంపల్లె

అయ్యప్ప దీక్షతో మనిషి సన్మార్గం వైపు పయనిస్తాడని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో బుధవారం అయ్యప్ప స్వామి భక్తులు గ్రామోత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో తులసిరెడ్డి మాట్లాడుతూ దీక్ష వల్ల మనిషిలో గర్వం, అహంకారం నశించడంతోపాటు మనిషి సాత్వికుడవుతాడని తెలిపారు. గ్రామోత్సవంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, నాగరాజు, వినయ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

-105 గ్రాముల బంగారం, 116 గ్రాముల వెండి స్వాధీనం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో విశ్వనాథరెడ్డి అనే ఉపాధ్యాయుడి నివాసంలో ఈ ఏడాది జులై 17న జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సిఐ జీవన్ గంగనాథ్ బాబు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో బుధవారం ఆయన వివరాలను వెల్లడించారు. విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు సొంత పని నిమిత్తం కడపకు వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగలగొట్టి 105 గ్రాముల బంగారం, 116 గ్రాముల వెండి వస్తువులను దొంగలించారన్నారు. ఎస్పి, డిఎస్పి ఆదేశాల మేరకు పోలీసులు రెండు టీంలుగా విడిపోయి దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. పట్టణంలోని ముద్దనూరు రింగ్‌రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న లింగుటెల రాంబాబు, నడింపల్లి గోపీ, సోను కుమార్‌రాయ్‌ని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వారు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి 105 గ్రాముల బంగారం, 116 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ జీవన్ గంగానాథ్ బాబు

డిజిటల్ విధానంలో పన్నులు చెల్లింపు

- డివిజనల్ పంచాయతీ అధికారి తిమ్మక్క

ప్రజాశక్తి - ముద్దనూరు

ఇంటి పన్నుతోపాటు ఇతర చెల్లింపులు పారదర్శకంగా జరిగేలా ప్రభుత్వం డిజిటల్ పేమెంట్ విధానం అమలు చేసినట్లు జమ్మలమడుగు డివిజనల్ పంచాయతీ అధికారి తిమ్మక్క తెలిపారు. ముద్దనూరు, నల్లబల్లె, ఉప్పలూరు గ్రామాల్లోని సచివాలయాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం తిమ్మక్క మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీల్లో భాగంగా ఇంటి పన్నులు, ఇతరాలు చెల్లించేందుకు ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని అమలు చేసినట్లు చెప్పారు. అందులో భాగంగా ఆ వివరాలను సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ పేమెంట్ ద్వారా ఇళ్లకు పన్ను విధించడం వసూలు చేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు డిజిటల్ పేమెంట్ ద్వారా ఇంటి పన్నులు చెల్లించవచ్చన్నారు. డిజిటల్ పేమెంట్ ద్వారా పన్ను చెల్లించిన వెంటనే లబ్ధిదారులకు, అధికారులకు, ప్రభుత్వానికి మెసేజ్ వస్తుందన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి వీరభద్రుడు, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనరసింహులు, విజయభారతి, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, మహిళా పోలీసులు ఆకాంక్ష, శివజ్యోతి, డిజిటల్ అసిస్టెంట్ సాయిలత పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలిస్తున్న తిమ్మక్క

విత్తనాలు కొనే ముందు పరిశీలించాలి

వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - చాపాడు

విత్తనాలు కొనే ముందు పరిశీలించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండల పరిధిలోని సోమాపురం గ్రామంలో బుధ వారం ఊటుకూరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.వీరయ్య, శ్రీవల్లి వరిపంటను పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు వెంకటస్వామి, పెద్ద వెంకట సుబ్బయ్య, పుల్లయ్య ఖరీఫ్ సీజన్‌లో బిపిటి 5204 రకం సాగు చేశామని, ఈ పంట వేరే రకంగా ఉందని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు శాస్త్రవేత్తలు పంట నిర్ధారణ నిమిత్తం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంటను పరిశీలించామని, నమూనాలు సేకరిస్తున్నామన్నారు. పంట రకాన్ని నిర్ధారించి వ్యవసాధికారులకు సమాచారం ఇస్తామన్నారు. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉందని, నూర్పిడి సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులు విత్తన సేకరణలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో విఎఎ పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో ఫసల్ బీమా చెల్లించాలి

డిసెంబరు 15లోగా ఫసల్ బీమా రైతుల వాటా ప్రీమియం రైతు చెల్లించుకోవాలని ఏఓ మ్యాగీ తెలిపారు. మండల పరిధిలోని అనంతపురం, అయ్యవారిపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా ద్వారా రబీలో సాగు చేసే వేరుశెనగ, మినుము, జొన్న పంటలకు బీమా చెల్లించాలన్నారు. రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన జొన్న పంటకు కత్తెర పురుగు అధికంగా సోకుతుందన్నారు. దీని నివారణకు డెవిగెట్ 2.5 మిలీ లీటర్ నీటికి పిచికారి చేయాలన్నారు. పురుగు నివారణకు కార్బొ ఫ్యూరాన్ గుళికలు చల్లాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట ఆశాజనకంగా ఉందన్నారు. కార్యక్రమంలో విఎఎ భార్గవి, రైతులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పెద్ద రంగాపురం గ్రామంలో ఎఒ జి.నాగలక్ష్మి బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో పంటల బీమాకు సంబంధించిన వివరాలను తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన క్రింద 8 రకాల పంటలకు మంజూరు చేశారని, ఈ పంటలకు సంబంధించిన ప్రీమియం రైతులు సిఎస్సి లేదా సచి వాలయంలోని డిజిటల్ అసిస్టెంట్, ప్యాక్స్, పోస్ట్ ఆఫీస్ ద్వారా వారి ఆధార్, భూమి కవులు కార్డు, పంట వేసిన ధ్రువపత్రాన్ని బ్యాంకు వివరాలకు సంబంధించిన పత్రాలను సమర్పించి ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించాలన్నారు. డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించాలన్నారు. కంది పంటను పరిశీలించి, రసం పీల్చే పురుగుల నివారణకు వేప నూనె రెండు మిల్లీలీటరు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి సూచించారు. కార్యక్రమంలో పెద్ద రంగాపురం రైతు సేవ కేంద్రం ఇన్‌ఛార్జి ఎం.హరిత, రైతులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా బీమా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. హనుమానగుత్తి గ్రామ పొలాల్లో బుధవారం కంది, శనగ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, ఎఒ శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ సహాయకుడు పవన్, రైతులు పాల్గొన్నారు.

ముంపు రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - పెద్దముడియం

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు కావస్తున్నా రాజోలు ముంపు రైతులకు ఇంతవరకు పరిహారం చెల్లించలేదని, తక్షణమే వారికి చెల్లించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి గోపాల్ దాస్ ఏసుదాసు డిమాండ్ చేశారు. మండలంలోని రాజోలు ముంపు గ్రామాలను బుధవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ రాజోలు ముంపు వాసులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. ముంపు గ్రామాల్లోని రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు ముంపు రైతులకు రావలసిన పరిహారంతోపాటు త్వరితగతిన పునరావాసాలను ఏర్పాటు చేసేలా చొరవ చూపాలన్నారు. జాప్యం జరిగితే రైతుల తరపున కలెక్టర్ కార్యాలయం ముందు రైతులతో ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ బాల నరసింహులుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వినయ్, విజయ్ పాల్గొన్నారు.

నాఫెడ్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

నాఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కేటా యించబోయే స్థలాన్ని బద్వేలు ఆర్‌డిఒ చంద్రమోహన్, మైదుకూరు తహశీల్దార్ రాజసింహ నరేంద్ర బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వనిపెంట కెవికెను వారు సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ మైదుకూరు ప్రాంతంలో అధికంగా కేపీ ఉల్లి రకం సాగవుతుందన్నారు. చాలా కాలంగా రైతులు మైదుకూరు ప్రాంతంలో ఉల్లి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారన్నారు. వారి అభ్యర్థన మేరకు ప్రభుత్వం నాఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా కెవికె సమీపంలో స్థలాన్ని పరిశీలించామన్నారు. అనంతరం పెరటి తోట విత్తనాలను కెవికె శాస్త్రవేత్తలు విద్యారాణి, ఫిరోజ్, కాంతిశ్రీ వారికి అందజేశారు. కార్యక్రమంలో ఉత్తమ రైతు బిపి ప్రతాప్‌రెడ్డి, సర్వేయర్, విఆర్ఓ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణే కిశోరి వికాసం లక్ష్యం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్) విద్యార్థులకు నగరిగుట్ట, బాకారాపురం పట్టణ ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ స్నేహ ప్రత్యూష, డాక్టర్ శాంతకుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు, రక్తపోటు, రక్తహీనత, ఎత్తు, బరువు వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ వయసులో బాల బాలికలలో వచ్చే మార్పులు, తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆరోగ్యంపై దృష్టిపై వివరించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ పాల్గొన్నారు.

ఉచితంగా రూ.5 లక్షల హెల్త్ కార్డు

ప్రజాశక్తి - తొండూరు

పిఎంజెఎవై ద్వారా ఉచితంగా రూ.5లక్షల హెల్త్‌కార్డు పొందవచ్చని డాక్టర్ అరిపుల్లా తెలిపారు. ఈ స్కీమ్ లబ్ధిదారులను సామాజిక, ఆర్థిక, కుల జనగణన (సోషియో ఎకనామిక్ క్యాస్ట్ సెన్సస్) ప్రాతి పదికగా తీసుకుంటారని పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇనగలూరు విలేజ్ క్లినిక్‌లో బుధవారం డాక్టర్ ఆరిపుల్లా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య ఏఎన్ఎం గౌరీ, ఆశ వర్కర్లు రమాదేవి, వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అరిపుల్లా

పోషక విలువలపై అవగాహన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండల పరిధిలోని నలబద్దపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు సమగ్ర పోషకాలు-విలువలుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి హెచ్ఎం కృష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ కోసం పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ జయప్రదీప్ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. 150 మంది విద్యార్థులకు క్యారీ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిఎండి రాహుల్, రైతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ సంరక్షణ శిక్షణకు ఎఒ

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి హైదరాబాద్‌లో రెండు రోజులపాటు జరిగే పర్యావరణ సంరక్షణ శిక్షణకు వెళ్లనున్నారు. ఈనెల 28, 29న ఆయన శిక్షణకు హాజరుకానున్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఎఒ సూచించారు.

టివి వితరణ చేస్తున్న బిఎస్ రమణారెడ్డి

సేవ చేయడం అందరి బాధ్యత

ప్రజాశక్తి - వేంపల్లె

విభిన్నప్రతిభావంతులకు సేవ చేయడం మనందరి బాధ్యత అని ఉషాకిరణ్ పాఠశాల కరస్పాండెంట్ బిఎస్ రమణారెడ్డి పేర్కొన్నారు. రమణారెడ్డి పుట్టినరోజు సందర్భంగా వేంపల్లె భవిత కేంద్రానికి స్మార్ట్ టివి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి జీవిత ప్రయాణం సమాజానికి ఆదర్శంగా ఉండాలన్నారు. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని అందుకు అనుగుణంగా శ్రమించి జీవితంలో ఉన్నత స్థానాన్ని సాధించాలన్నారు. సమాజానికి చేతనైనంత సహాయం చేయాలనే ఉద్దేశంతో తాను ఈ చిరు కానుక ఇచ్చినట్లు చెప్పారు. విభిన్నప్రతిభావంతుల చిన్నారులకు విశిష్ట సేవలందిస్తున్న భవిత సెంటర్ సిబ్బంది యశోద, సుజాత, ఆయాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ప్రజాశక్తి - వేముల

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సభా భవనంలో బుధవారం ఎంపిపి చల్లా గంగాదేవి వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జడ్‌పిటిసి కోగోటం వెంకట బయపురెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, తహశీల్దార్ ఇందిరారాణి హాజరయ్యారు. సమావేశంలో ఎస్ఐ పి.ప్రవీణ్ కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'ఉక్కు'పై పార్లమెంట్‌లో చర్చించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో విభజన హామీల్లో భాగమైన కడప జిల్లా ఉక్కు పరిశ్రమపై చర్చించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. స్థానిక ఐటిఐ కళాశాలలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ పట్ల నిర్లక్ష్యంగా ఉందన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో చదువుకున్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించక గల్ఫ్ దేశాలకు వలస పోతున్నారన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఉపాధి పరిశ్రమలు చాలా అవసరమన్నారు. ఇందులో ఉక్కు పరిశ్రమ వంటి భారీ పరిశ్రమ వస్తే ఎక్కువ సంఖ్యలో యువతకు ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రులు అందరూ రాయలసీమ ప్రాంత వాసులేనని, వారు మారుతున్నా కడప ఉక్కు పరిశ్రమకు వేసిన పునాది రాయి ముందుకు కదలడం లేదన్నారు. మన ఎంపీలు యువతకు ఉపాధి కోసం పార్లమెంటులో గళమెత్తాలన్నారు. కార్యక్రమంలో స్టానిక నాయకులు సాయిప్రశాంత్, నరేంద్ర, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో నాసిరకం భోజనం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు అన్న క్యాంటీన్‌లో పేద ప్రజలకు పెడుతన్న భోజనం నాసిరకంగా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ తెలిపారు. బుధవారం ఉదయం ఎర్రగుంట్ల పట్టణంలో విలేకరుల సమావేశంలో అన్వేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో ప్రారం భించిందన్నారు. అక్షయ పాత్ర కాంట్రాక్టర్ ద్వారా సప్లై చేస్తున్నరని తెలిపారు. బుధవారం అన్న క్యాంటీన్ భోజనాన్ని పరిశీలించామన్నారు. నాసిరకం భోజనం సప్లై చేస్తున్నారని మున్సిపల్ అధికారులు అక్షయపాత్ర కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన భోజనం అందేలా అధికారులు చార్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సహకార దర్శి సురేష్ బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వి.అన్వేష్

సిఎం రిలీఫ్ ఫండ్ మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

పేదలకు వరం సిఎం సహాయ నిధి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజవకవర్గ పరిధిలో సిఎం సహాయ నిధి కింద 17 మంది బాధితులకు రూ.29.28 లక్షల చెక్కులను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అందజేశారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అన్ని రకాల సేవలకు ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. పథకం ద్వారా వైద్య సేవలు అందని వారు ఎవరైనా ఉంటే అలాంటివారు ఆర్థికంగా నష్టపోకుండా సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో దువ్వూరు మండలశాఖ అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి, మైదుకూరు పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, చాపాడు టిడిపి నాయకులు కిషోర్‌కుమార్ రెడ్డి, ఎ.వెంకట రమణారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

- వచ్చేనెల 8న ఐదు సంఘాలకు ఎన్నికలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో పులివెందుల బ్రాంచ్ కెనాల్(పిబిసి) పరిధిలోని ఆయకట్టు రైతులకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మండలంలోని సింహాద్రిపురం, కసనూరు, హిమకుంట్ల, అంకాలమ్మ గూడూరు, బలపనూరు డిస్ట్రిబ్యూటరీల పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి ఆయా సిబ్బందికి క్షేత్రస్థాయిలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిసెంబర్ 8న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రెవెన్యూ శాఖ అధికారులు ఆయకట్టు పరిధిలోని ఓటర్ల జాబితాను గుర్తించి ఇరిగేషన్ శాఖ అధికారులకు అందజేశారు. 5న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 8వ తేదీ ఎన్నికలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు సభ్యులను ఎన్నుకోనున్నారు.

పర్యాటక ప్రదేశాలతో మరింత అభివృద్ధి

- జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పర్యాటక ప్రదేశాలతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని జమ్మలమడుగు జనసేన కో -ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. బుధ వారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటన సంతోషాన్ని ఇచ్చిందన్నారు. సాష్కీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.113.75 కోట్లు విడుదల చేసిందని, దీంతో గోదావరి, గండికోట ప్రాంతాలను పర్యటకంగా అభివృద్ధి చేస్తామనడం హర్షణీయమన్నారు. పర్యాటకులకు గండికోటలో మౌలిక సదుపాయాలు కల్పిస్తే దేశవ్యాప్తంగా ఉన్న పర్యాటకులను మరింత ఎక్కువగా ఆకర్షించవచ్చని తెలిపారు. గతంలో గండికోట, మైలవరంను పర్యటకంగా అభివృద్ధి చేయాలని మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామని నాగార్జున తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమ్మిళితం ద్వారానే గండికోట అభివృద్ధి చెంది రాయలసీమ జిల్లాలకు మంచి ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాకే అసలైన రాజ్యాంగం నడుస్తోంది

- టిడిపి వాణిజ్య విభాగ జిల్లా అధికార ప్రతినిధి ప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కూటమి ప్రభుత్వం వచ్చాకే అసలైన అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తోందని టిడిపి వాణిజ్య విభాగ జిల్లా అధికార ప్రతినిధి ఆకుల ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాజ్యాంగం గురించి వైసిపి నాయకులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గత ప్రభుత్వంలో మాస్కులు ఇవ్వనందుకు డాక్టర్‌ను అతి దారుణంగా చంపేశారు. లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో నాగమ్మ అనే దళిత మహిళను రేప్ చేసి చంపేశారు. ఎమ్మెల్సీ డ్రైవర్‌ను అతికిరాతంగా కొట్టి చంపేసిన చరిత్ర వైసిపిదేనని ఆయన ఆరోపించారు. గతంలో దౌర్జన్యాలు, రౌడీయిజం, కబ్జాలు తప్ప ఇంకేమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. ప్రస్తుతం శాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉంటూ.. ప్రజలు ప్రశాంతంగా ఉన్నారన్నారు.

భోజనం పెడుతున్న టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి

విద్యార్థులకు తిథి భోజనం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు తిథి భోజనం ఏర్పాటు చేశారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శనగల రాజశేఖర్ ఆధ్వర్యంలో వనభోజనం ఏర్పాటు చేశారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ బుజ్జి విద్యార్థులకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా రామమునిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బాలుర పాఠశాల వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.5 లక్షలు, బాలికల పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.5 లక్షలు మంజూరు చేయించారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు శివమునెమ్మ మాట్లాడుతూ విజ్ఞానంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు మంచి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘమేశ్వరరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, వాణి, ధర్మారెడ్డి, బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిల్పారామంలో కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కార్తీక మాసం సందర్భంగా శిల్పారామంలో బుధవారం వనభోజనాలను ఘనంగా నిర్వహించారు. శిల్పారామం సిబ్బంది, ఉలిమెల్ల లేక్ సిబ్బంది కలిసి ఉసిరిచెట్లు కింద వనభోజనాలు చేశారు. అనంతరం సిబ్బంది మ్యూజికల్ చైర్, స్పూన్‌తో లెమన్, తాడు లాగుట పోటీలు నిర్వహించారు. విజేతలకు పరిపాలన అధికారి సుధాకర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎఇ వెంకట సుబ్బయ్య, ఫీల్డ్ సూపర్‌వైజర్లు ఇస్మాయిల్, సుబ్బారావు, వరప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వనభోజనం చేస్తున్న శిల్పారామం సిబ్బంది